ఆంధ్రవాహిని (అట్టావా) నిర్వహించిన 1988 శ్రీరామనవమి కథానికల పోటీలో సాధారణ ప్రచురణకి ఎన్నికైన కథ

# హో! అప్పుడేనా

బి. త్యాగరాజు

**తన్మయి తొలిసారి పురుడు పోసుకొని మూడు నెలలు నిండిన పండంటి పాపతో తన ఇంటికి వచ్చిన రాత్రే భర్త చయనమూర్తి తెచ్చిన మల్లెపూలు పెట్టుకోలేదు.**

"మయీ! పూలు పెట్టుకోవడం మరచిపోయావా?" అని అడిగాడు చయనమూర్తి.

"కాదండీ ఇష్టం లేకే పెట్టుకోలేదు!" తన్మయి అతి సౌమ్యంగా అంది.

అది విని చయనమూర్తి కొన్ని లిప్తల కాలం విస్తుపోయాడు.

కాపురానికి వచ్చింది మొదలు కాన్పుకు వెళ్ళే దాకా మల్లెపూలంటే ఎగిరి గంతేసే తన్మయి నోట తాను విన్నది నిజమని నమ్మాలా? కాకపోతే పెద్ద జోకనుకోవాలా?

నడక నేర్చిన చిన్నారి చిట్టి చేతుల్లోంచి జున్ను ముక్కను కాకి లాక్కెళ్ళినట్టు మల్లెలపొట్లాన్ని అందుకుపోయే తన్మయేనా అంటున్నది!

ఏ రోజయినా పూలు తేవడం మరిచిపోతే అప్పటి కప్పుడు తిరుగు ముఖం పట్టించి తెప్పించుకునే ఆ తన్మయిని ఏ దయ్యమైనా ఆవేశించిందా?

ఒక వంక చయనమూర్తి ఆలోచనలు ఇలా సచేతనాలవుతుంటే మరో వంక తన్మయికి వాళ్ళ బామ్మ చేసిన హెచ్చరిక గుర్తుకు రాసాగింది.

"మయీ! నీకిదివరకే చెప్పాను. ఇప్పుడూ చెబుతున్నాను. మల్లెపూలు పెట్టుకుంటే తల్లి పాలు పట్టిపోతాయి. పోతేయేం? ఆవు పాలో, గేదె పాలో, కాకపోతే ఏ డబ్బా పాలో తాగిస్తే సరి అని సరిపెట్టుకోకు. ఏ పాలూ తల్లిపాలకు సాటిరావు. ఎంచేతంటే తల్లి పాలల్లో రోగ నిరోధక శక్తి పుష్కలంగా ఉంటుంది. ఇక మీ ఆయన ఎంత బతిమాలినా, ఎంత పట్టుబట్టినా మల్లెపూలు పెట్టుకోకు. అంతగా మొరాయిస్తే పక్షం రోజులకో, నెల రోజులకో ఒకమారు! ఏమ్మా! నా మాట గుర్తుంచుకుంటావు కదూ?" అని తాను వచ్చే ముందు గుర్తు చేసింది బామ్మ.

"మయీ! నువ్వనేది నిజమా? అయితే ఎందుకు?" అని అడిగాడు చయనమూర్తి.

"మల్లెపూల వల్ల తల్లిపాలు తగ్గిపోతాయని మా బామ్మ చెప్పింది. కనీసం ఆరు మాసాలయినా వాటికి దూరంగా వుండమంది. అలా చేయకపోతే మన పాపకు మనమే చేజేతులా పాలు లేకుండా చేసినట్లవుతుంది. నా మాట విని నన్ను మల్లెపూలు పెట్టుకొమ్మని వత్తిడి చేయకండి" అని తన్మయి భర్త విశాల వక్షం మీద వాలిపోయింది.

"మయీ! మీ బామ్మ చెప్పిన దాంట్లో ఏమాత్రం నిజం లేదు. అది వట్టి మూఢ నమ్మకం. కాకపోతే తల్లి పాలకూ, మల్లె పూలకూ ఏమిటీ సంబంధం? కాస్త ఆలోచించు. పెద్దలు చెప్పారని ప్రతిదాన్ని మూర్ఖంగా పాటించడమేం బాగుండదు. ఇప్పుడు కాకపోయినా రేపీ సమయానికి నీ నిర్ణయాన్ని మార్చుకుంటే మంచిది" అని నయాన చెప్పి అప్పటికి సర్దుకుపోయాడు చయనమూర్తి.

మరునాటి రాత్రి వరకూ తన్మయి తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. పైగా మల్లెపూలు అసలే ఇంటికి తేవద్దని, వాటి వాసన సహితం సోకరాదని ఖచ్చితంగా చెప్పింది.

అయినా చయనమూర్తి తన ప్రయత్నాన్ని విరమించుకోలేదు. వారం రోజుల పాటు విధి తప్పక మల్లెపూలు తెచ్చాడు. పెట్టుకొమ్మని ప్రాధేయపడ్డాడు. నానా విధాలా నచ్చజెప్పి చూశాడు. అంతా వృధా ప్రయాసే అయింది. విసిగి వేసారి పోయాడు. ఇక మరో వైపు నుండి నరుక్కురావాలనుకున్నాడు.

ఆ వారం రోజులు ప్రతి సాయంకాలం తన్మయి తనను తాను అందంగా, ఆకర్షణీయంగా అలంకరించుకోవడంలో ఎప్పటికన్నా ఎంతో ఎక్కువ శ్రద్ధ వహించింది. హావ భావాల్లో రాగానురాగాలు, ఉత్సాహమూ, ఉల్లాసమూ ఉట్టిపడేలా వ్యవహరించింది. భర్తకు మల్లెపూలు లేని లోటు అనిపించకూడదని విశేషంగా ప్రయత్నించింది.


కాని చయనమూర్తికి ఆ లోటే కొట్టవచ్చినట్లు అగుపించింది.

ఏ కూరగాయని ఎంత విలువైన ద్రవ్యాలు వేసి, ఎంత శుచిగా వండినా, ఉప్పు లేని కూర రుచి, నోటికి రుచించనట్లే ఆమె ఏ అలంకారమూ చయనమూర్తికి నేత్రోత్సాహాన్ని కలిగించలేక పోయింది. ఆ ఆహ్లాదాన్ని అందించలేకపోయింది.

అందుకే చయనమూర్తి తన్మయిని తన దారికి తెచ్చుకోవాలని ఒక ఎత్తు వేశాడు. మల్లెపూలు పెట్టుకునే వరకూ ఆమెను అంటకూడదు. ముట్టకూడదు, అంతే కాక మాటాడకూడదన్న దీక్ష పట్టాడు.

అలా వారం రోజులు గతానికి దీనంగా, కడు హీనంగా అధీనమయ్యాయి.

ఆ ఏడు రోజులు తన్మయికి ఎడారిలో ఒంటరి



ప్రయాణం చేసిన అనుభూతిని చవి చూపాయి.

ఒకే ఇంట్లో ఉంటున్నా, ఒకే శయ్యపై పడుకుంటున్నా ఒక ఓరకంటి చూపు లేదు. ఒక తియ్యటి నోటి మాట లేదు. పొరపాటున కూడా ఒక వెచ్చని స్పర్శకు సహితం నోచుకోలేదు. తామరాకు మీది నీటి బొట్టులా అంటీ అంటనట్లుంటున్నాడు. తనను లొంగదీసుకోవాలన్న ధ్యేయంతో పంతంబట్టి అలా ప్రవర్తిస్తున్నారు తప్ప మరేమీ కాదన్న ధీమా నిండుగా ఉన్నందున ఆమె భర్త తీరుకి అంతగా భయపడలేదు. అంతా యాంత్రికంగా ఉంటోంది.

కాని మరో మూడు రోజులు గడిచాక ఆమెకో అవాంతరం ఎదురయింది.

అది వారి పెళ్ళి రోజు!

ఆ రోజు చయనమూర్తి ఇదివరకులా ఇంటి వద్దనే ఉండక ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

తన్మయి విశ్రాంతిగా కూర్చుంది. మల్లెపూలు ఆ రోజున పెట్టుకోవాలా, మానాలా అని ప్రశాంతంగా ఆలోచిస్తోంది.

పెళ్ళి రోజున మల్లెపూలు లేకుండా ఉండడం ఆమెకే విధంగానూ ఉచితమనిపించ లేదు. దానితో ఆమె ఆలోచనా సరళి పూర్తిగా మారిపోయింది.

భార్యా భర్తలు ఏ విషయం లోనూ పంతాలకు, పట్టింపులకు పోరాదు. ఒకవేళ పోయినా పట్టూ - విడుపూ అనేది ఉండాలి. తెగేదాకా లాగడం తెలివి గల వాళ్ళ పని కాదు. కళ్ళుండీ కాంతిని కానలేక గంతలు కట్టుకున్నట్లే అవుతుంది. గోటితో పోయే దానిని గొడ్డళ్ళ దాకా రానివ్వడమెందుకు? తన పట్టు సడలించుకోవాలి. అంటే ఆ ఒక్క రోజుకేనా? ఆ తరువాత కూడానా? తనలో బామ్మ మూలంగా పాకుడులా పట్టుకున్న భయాన్ని ముందు దూరం చేసుకోవాలి. అది తమ మధ్య ఒక సమస్యకు దారితీసింది. తను ఎటూ తేల్చుకో లేక పోతుంది. ఎవరి సలహానైనా కోరాలి. ఎవరిని కోరాలి? ఎవరిని? ఎవరిని? అని ప్రశ్నించుకుంటున్న తన్మయి దృక్పథంలో ఓ మహాతల్లి, పరిష్కారాల కల్పవల్లి మెరుపులా తళుక్కున మెరిసింది.

ఒక నిర్ణయానికి వచ్చాక దాన్ని ఆచరించడంలో ఆలస్యం చేయడం తన్మయి స్వభావం కాదు.

ఆ సాయంకాలం-

ఆఫీసు నుండి వచ్చిన భర్తకి తన్మయి గుమ్మం దగ్గరే మొలక నవ్వులతో స్వాగతం చెప్పింది.

ఆ రోజు తమ పెళ్ళి రోజని, ఘనంగా జరుపుకుందామని, ఉత్సాహం ఉరకలు వేస్తున్నట్లు చెప్పింది. ఇక మల్లెపూలు పెట్టుకోవడానికి తనకే అభ్యంతరం లేదని మనస్ఫూర్తిగా చెప్పింది.

ఈ పది రోజులుగా గడుపుకున్న ఎడారి బతుకు భవిష్యత్తులో రాదని మాట ఇవ్వండని వేడుకుంది.

చయనమూర్తి భార్యలో ఇంత త్వరగా మార్పు వస్తుందని ఆశించలేదు. సంతోషాతిశయంలో తాము వీధి గుమ్మంలోనే ఉన్నామన్న ధ్యాస కూడా లేకుండా, తన్మయినితన పరిష్వంగం లోనికి తీసుకొని, "మయీ! మన జీవితంలో ఆ ఎడారి బతుకు మళ్ళీ రాదు. మన పాప మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. అంతే కాదు. ఈ రాత్రి మొదలుకుని ప్రతి రాత్రిని నిత్య నూతన వసంత రాత్రిలా మలచుకుందాము సరేనా?" అని



ఆమెను సమాధానపరిచాడు.


ఆ దంపతులు పెళ్ళి రోజు సంబరాన్ని గతంలోకన్నా ఘనంగా, గణనీయంగా జరుపుకుందామనుకున్నారు.

మంచాన్ని ఎలా ఏఏ పూలతో అలంకరించుకోవాలో పరస్పరం సంప్రదించుకున్నారు.

మంచానికి దోమ తెరకు మారుగా ఒక ప్రత్యేకమైన పద్ధతిలో మల్లెలు, కనకాంబరాల మాలలతో ఆ రెంటిని జత చేసి అల్లిన మాలల్ని గులాబీ మాలల్ని పక్క పక్కన తోరణాలుగా అలంకరించుకుందామని ముచ్చట పడ్డారు.

చయనమూర్తి గోడకు విసిరిన బంతిలా బజారుకు వెళ్ళి పూలు, పండ్లు, స్వీట్లు, లేటెస్టు ఫాషన్ చీర తీసుకొని క్షణాల్లో తిరిగివచ్చాడు.

మంచం అలంకరణ కార్యక్రమానికి ఉభయులూ




ఏకంగా ఉపక్రమించారు.

"మయి! మన సమస్య ఇంత త్వరగా సమసిపోతుందని కలలోనూ అనుకోలేదు. మన పెళ్ళి రోజు నీ చొరవ కావడం కాదా! అందుకు నిన్ను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను!" అని చయనమూర్తి తన్మయిని మాటల్లోకి దించాడు.

"అభినందించాల్సింది నన్ను కాదండి. కృష్ణక్కయ్య గారిని. పోతే మన పెళ్ళి రోజు రావడం వల్లే నేను మల్లెపూల విషయంలో పునరాలోచన చేయవలసి వచ్చింది. పెళ్ళి రోజు సంవత్సర కాలంలో ఒకేసారి వస్తుంది. అలాంటి రోజుని ఉలుకూ పలుకూ, మాటా మంతీ, నవ్వులూలాంటివి ఏవీ లేకుండా సారవిహీనంగా, రస రహితంగా, చొప్పదండులా చప్పగా గడుపుకోవడం అతి దుర్భరం, దుస్సహంఅనిపించింది. అందుకని కృష్ణక్కయ్య గారి వద్దకు వెళ్ళాను. మల్లెపూల గురించి బొమ్మ చెప్పింది చెప్పినట్లు చెప్పాను. ఆమె ఎంతో తేలిగ్గా విషయ వివరణ చేసి, పరిష్కారం కూడా చూపారు" అని తన్మయి కాసేపు ఆగి భర్త వైపు చూసింది.

"ఆ వివరణ ఏమిటి? పరిష్కారమేమిటి?"

"మల్లెపూలు తమ సహజ సౌరభాల గుబాళింపుతో పురుషుల్ని కామోద్రేకుల్ని చేస్తాయని, దానితో స్త్రీకి నెలతప్పే అవకాశం అధికంగా ఉంటుందని చెప్పింది. నెల తప్పితే మాత్రం తల్లిపాలు క్రమంగా తగ్గుముఖం పడతాయనీ చెప్పింది. ఇక ఒక్కమాటలో చెప్పాలంటే ఒక శిశువుకు, మరొక శిశువుకు మధ్య ఎడం ఎక్కువగా ఉండాలన్నదే బొమ్మ హెచ్చరికలో గల ధ్యేయమట! అయితే ఆ ధ్యేయసాధనకు ఈనాడు ఎన్నోసాధనాలున్నాయని, వాటిలో ఏది వినియోగించుకున్నా దాంపత్య సుఖాన్ని యథేచ్ఛగా పొందవచ్చని ఆమె సలహా ఇచ్చారు" అని తన్మయి తెలిపింది.

"అయితే డాక్టరు గారి సలహా పాటించావా లేదా?"

"లేదు"

"ఎందుకు? నన్ను సంప్రదించాలని మానుకున్నావా?"

"అదీ కాదు!"

"మరి దేనికి?"

"ఆ అవసరం లేదిక!"

"అంటే?"


"నెల తప్పింది."

"హా! అప్పుడేనా!?" అంటూ చతికిలబడి నెత్తికి చేతులు బెట్టుకున్నాడు చయనమూర్తి.




పరిశుభ్రంగా బాగుచేసిన
పచారి సరుకులు
SHAH.
ఫ్యాన్సీ మరియు జనరల్ గూడ్స్, నీలగిరి - కాఫీపొడి, సుగంధ పరిమళ వక్కపొడి మరియు బాగుచేసిన నమ్మకమైన పాతబియ్యం హోమ్ డెలివరి సౌకర్యంతో లభించును.
నేడే... విచ్చేయండి!!
ఫోన్స్:73676 : Shop
:65710 : Resi
విజయదుర్గ
కాఫీ & జనరల్ స్టోర్సు
కాశేశ్వరరావు రోడ్ (బీసెంట్ రోడ్ క్రాస్)
గవర్నరుపేట, విజయవాడ-520 002



పెండ్లికి ముందు, పెండ్లి తరువాత

అన్నిరకములైన వ్యాధులను ఇంకా నపుంసకత్వాన్ని, హస్త ప్రయోగమువలన నరాల బలహీనతకు, స్వప్న మందు వీర్యస్కలనము వలన బలహీనతకు (V.D) గనేరియా, సిఫిలిస్, ఇంకా సంతానములేనివారు సంతానమును కలిగించుకొండి. ఈ వ్యాధులకు సుమారు ఎన్నో సంవత్సరములు అనుభవముగల డాక్టరు ఎం.హెచ్.మల్లిక్ (Govt. Regd) గారితో చికిత్స పొందవలెను. వీరి చికిత్స నుంచి వేలాది ప్రజలు రోగముల నుంచి సుఖపడినారు.
సూచనము: మీరు ఏ రోగము వున్నా పర స్థలమునుంచైనా పోస్టుద్వారా పత్రము వ్యవహరించుకొని మందులు పోస్టు పార్సిల్ ద్వారా తెప్పించుకొని ఉపయోగించుకొనవచ్చును. మీరు మీ దాంపత్య సుఖమును పొందండి.
సంప్రతించు వేళలు: ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 8 గం. వరకు.
ఆదివారం కూడా పనిచేయును.
మల్లిక్ డిస్పెన్సరి
34/2, శ్రీ హరిరాం కాంప్లెక్స్, సాగర థియెటర్ ప్రక్కన
కెంపేగౌడ రోడ్డు బెంగుళూరు- 560 009